పొగాకు కంపెనీ బెల్లు మోగింది. సావిత్రి తన ముందున్న పొగాకు పన తీసి మేస్త్రీ బల్లదగ్గర పడేసింది. దోపుకున్న చీరె కొంగులు జారవిడిచి బయటికొచ్చింది. 'ఎండగా లేదు ఇవాళ, కాస్త చల్లగానే వుంది' అనుకుంది. గబగబా నడుస్తోంది. కంపెనీకీ, ఇంటికీ అట్టే దూరం లేదు. కాస్త అడుగు సారించి వేస్తే అయిదారు నిమిషాల్లో వెళ్ళిపోవచ్చు.

''ఇంట్లో పిల్లలు ముగ్గురూ ఏం చేస్తుంటారో!' అనుకుంది.

'ఆ ఏవుందీ! పిల్ల వాకిలి ఊడ్చి ముగ్గువేసి వుంటుంది. లేకపోతే వేస్తూ వుంటుంది. పెద్దాడు నీళ్ళు తెస్తుంటాడు. చిన్నాడు... గోలీ కాయలు ఆడుతూ వుంటాడు' అనుకుంది.

వాళ్ళ నాన్నే ఉంటే ఇంత అన్యాయంగా ఉండి వుండరు పిల్లలు అనుకుంది.

బొట్టు పెట్టుకోకపోతే మొహం బావుండదు. పెట్టుకుంటుంటే నీళ్ళంతా చెవులు కొరుక్కోడం... అయితే అయిందిలే అనుకుని బొట్టుపెట్టుకోవడం మొదలు పెట్టింది.

సావిత్రికి నాన్న గుర్తొచ్చాడు. తనకి నాన్న వుండి మాత్రం ఏం బావుకుందిలే.

అమ్మకి వంటలు చేసి పోషించక తప్పిందా! అనుకుంది. కాసేపు నాన్న మీద కోపం వచ్చింది. అసలీ మగజాతి మీదే కోపం వచ్చింది.

అయినా నారాయణ మీద కోపమెందుకు! అనుకుంది. నారాయణ కులంగాని వాడని అమ్మా, నాన్నా మొత్తుకున్నా ఏడ్చినా చేసుకుంది. తను చేసుకోవడమేమిటి నారాయణే చెయ్యి పుచ్చుకుని గుళ్ళోకి లాక్కెళ్ళి పెళ్ళి చేసుకున్నాడు.

అవును! నారాయణే తన్ని కోరి మరీ చేసుకున్నాడు. ఆ చేసుకున్న మనిషి అర్ధాంతరంగా ఇలా వదిలేసి...

ఇల్లొచ్చేసింది... ఇంటి ముందు పోలీసు. ఏమిటది! పోలీసెందు కొచ్చాడబ్బా! ఏమయినా అయిందా ఏమిటి? ఆ నాబొంద ఏవుందిలే అవడానికి... డబ్బా, దస్కమా దొంగతనానికి అనుకుంది. అదేమిటి! పిల్లలా వుంది. అవును. లక్ష్మే. పోలీసు లక్ష్మితో మాట్లాడుతున్నాడేమిటి! ఈ పిల్లకేం పని? అధిక ప్రసంగం ఇదేనా! పెద్ద మనిషయింది ఇంకా ఆడపిల్లనన్న ఇంగితం లేదు. కోప్పడాలి అనుకుంది.

# పూలపొట్లం

## టి. వాణీ రంగారావు

హడావుడిగా నడవడంతో చెప్పు స్ట్రాపు తెగింది. పడేస్తేఎలా! చెప్పు తీసి మెళ్ళో వల్లతాడుకున్న పిన్నీసు పెట్టుకుంది. నాలుగడుగులు వేసేటప్పటికల్లా గుచ్చుకున్నట్టుంది. మళ్ళీ తీసి మళ్ళీ ఆ పిన్నీసే సరిచేసింది. ఈసారి బాగానే వుంది.

చెప్పులు కొనుక్కోవాలి. స్కూలుకివెళ్ళేప్పుడు ఎత్తు మడమల చెప్పులు తొడుక్కోవాలని గొప్ప కోరిక వుండేది సావిత్రికి. ఎన్నిసార్లు నాన్నని అడిగినా లాభం లేకపోయింది. అమ్మని అడగడానికి నోరొచ్చేది కాదు.

స్నేహితురాలు రమణికి ఎన్ని రకాల ఎత్తుమడమల చెప్పులో వుండేవి. ఒక్కసారి అడిగి వేసుకుంటేనో అనిపించేది. అడిగితే ఇవ్వనూ అంటే... అనుకుని ఊరుకుంది.

మునసబు గారి అబ్బాయి ''ఏయ్! సావిత్రీ నాకు నీ నోట్సు — ఇంగ్లీషుది ఒకసారి ఇవ్వవా!'' అని అడిగేటప్పటికి అంతటి వాడు అడిగాడు కదా అని ఇచ్చింది. అందులో రమణికి ప్రేమలేఖ పెట్టి ఇచ్చి రమణి కిమ్మన్నాడు. ''అమ్మో'' అంది తను. బతిమలా డు. ''సరే'' అని ఇచ్చింది.

తరువాత రమణి చాలసార్లు ఎత్తుమడమల చెప్పులు 'వేసుకోవోయ్' అని ఇచ్చింది. అడపాదడపా తొక్కునే సరికి మోజు తీరిపోయింది.

ఇల్లొచ్చింది.


''నేను తియ్యలేదంటే'' ఏడుపు గొంతుతో అంటోంది లక్ష్మి.

''నువ్వు తియ్యకపోతే ఎవరు తీశారు? నువ్వే తీశావు'' అంటున్నాడు పోలీసు.

సావిత్రి గుండె గుభిల్లుమంది.

''ఏంటండీ! ఏంటి!'' ఖంగారు ఖంగారుగా వుంది సావిత్రికి.

''ఈ పిల్ల మీ పిల్లా!'' అన్నాడు పోలీసు. ఆ గొంతు డబ్బాలో గులకరాళ్ళు గిలకరించినట్టుంది.



"అవును మా అమ్మాయే" అంది. పోలీసు ఒక్కసారి లొట్టలేసినట్టనిపించింది సావిత్రికి.

"ఏం చేసింది! ఏమయింది!" అడిగింది వాడి చూపుల్లో పొగాకు కంపెనీ మేనేజర్ చూపు, ఇల్లు గలాయన చూపు - ఎన్నో ఎన్నో చూపులు.

"ఏం చేసుద్ది! ఇల్లు గల్లాయన జేబులో ఎనిమిది వందలు తీసింది" అన్నాడు వాడు అది రుజువై పోయినట్టు

"మా అమ్మాయా! ఇల్లు గలాయన జేబులోనా?" సావిత్రికిదంతా అయోమయంగా వుంది.

"ఇల్లు గలాయన జేబులో కాక నా జేబులో తీసుద్దా! తీయనిస్తానా! జేబులో సెయ్యేడితే..." పెద్ద జోకులాగా భళ్ళున నవ్వాడు పోలీసు.

"అదేంటండీ! మా అమ్మాయి. తీసిందని ఎట్లా అసలు ఎవరన్నారు! ఏవిటే లక్ష్మి ఏవిటి? అంది సావిత్రి. "కూలి డబ్బులివ్వక అయిదు రోజులయింది, ఇవ్వాళ బియ్యమెట్టా దేవుడా!' అనుకుంటుంటే సావిత్రికిదొక గండం.

లక్ష్మికి తల్లిని చూడగానే భోరున ఏడుపొచ్చింది. పోలీస ముందు ఏడవడానికి కొంచెం సిగ్గేసింది.

ఏం చెప్తుందా అని పోలీసూ చూస్తున్నాడు. తాపీగా జేబులోంచి చుట్టతీసి నోట్లో పెట్టుకుని వెలిగించుకుంటూ ఓరకంట లక్ష్మినీ, సావిత్రినీ మార్చి మార్చి చూస్తున్నాడు.

పొగాకు కంపెనీ ఒదిలిన టైము, ఒక్కొక్కళ్లే వస్తున్నారు. వచ్చినవాళ్ళు వస్తున్నట్టే ఎవ్రరటోపీ కనిపించేప్పటికి అనుకోకుండానే చూసిపోతున్నారు. సంజె చీకట్లు ముసురుకుంటున్నాయి.


పెద్ద పిల్లవాడు శీను బడి వదిలారు. చేతిలో పుస్తకాలతో పరుగున వచ్చిన వాడల్లా తల్లినీ, అక్కనీ, పోలీసునీ చూసి ఆగిపోయాడు. చిన్న పిల్లవాడు వాసు వెనక వీథిలో గోళీలు ఆడుతున్న వాడల్లా ఎవరో "మిక్కాయినీ పోలీసు లెత్తుకెల్తన్నారు" అనేప్పటికీ పరిగెత్తుక వచ్చేశాడు.

అప్పటికే గుంపు గూడారు జనం.

సావిత్రి చుట్టూ చూసింది. అందరూ ఇంచుమించు చూసినవాళ్ళే. అందరితో పరిచయాలు లేకపోయినా తనూ, తన పిల్లలు, అందరికీ తెలుసు. తన బతుకూ అందరికీ తెలుసు. కుంచించుకుపోయింది సావిత్రి.

జనంలో కుర్రకారు అదోలా చూస్తున్నట్టనిపించింది.

పెళ్ళినాటి పట్టుచీర లంగా జాకెట్టు కుట్టించింది మొన్ననే. పెద్ద మనిషైందని పది మందికీ చేతులు కడిగించకపోతే శని అని చుట్టుపక్కల అందరూ గోలగోల చేస్తే చిన్న బంతి పెట్టి ఈ బట్టలు కుట్టించింది.




"ఓసీ, ఓసీ" అని గోలపెట్టినా కొనలేదు.

కంపెనీ మేనేజరుగారమ్మాయి! పెద్ద మనిషైతే షామియానా వేసి మైకు పెట్టి పెద్ద ఎత్తున బంతి పెట్టారు రెండేళ్ళనాడు.

"చూడు మేనేజర్ గారమ్మాయి చక్కగా ఫ్రాకు వేసుకుని వెడుతోంది కాన్వెంటుకి. నీకప్పుడే ఓసీ కావాల్సివచ్చింది! అన్నీ మోటు బుద్ధులు" అంటూ దబాయించి కూతుర్ని మాటాడనీయకుండా చేసింది.

బిత్తరపోయి తేలగుడ్లేసుకుని నిలబడ్డ కూతురి గుండెల మీదే వున్నాయి చాలా మంది చూపులు.

ఏవున్నా లేకపోయినా ఈ సంపద మాత్రం వుంది. జాకెట్టుకి సరిగ్గా రొమ్ముల మీదకి వచ్చేట్టు కుచ్చు పెట్టించింది అక్కడికీ. అది కూడా పిల్లకాస్త తొందరగా నడిచినా పరిగెత్తినా ఎగురుతూ అసహ్యంగా వుండేటప్పటికల్లా తీయించేసింది మళ్ళీ.

లోపల మల్లగుడ్డతో కుట్టిన బాడీ గట్టిగా బిగించి మరీ కడుతుంద తనే రోజూ అయినా...

గుంపులో వాళ్ళు గట్టి గట్టిగానే మాట్లాడుకుంటున్నారు. ఇంచుమించు అందరూ ఈ పిల్ల తీసిందనే అనుకుంటున్నట్టు—

"ఏం కాలమో ఏవో ఆడముండలక్కూడా పిదప బుద్ధులే" అని ఒకరు అంటే.

"నాలుగు పీకితే సరి అన్నీ బయటికొస్తాయి" అని ఒకరూ

"దరిద్రం ఏమైనా చేయిస్తుంది" అని ఒకరు.

"పాపం ఆవిడ ఊరెళ్ళిందిగా. ఆయన ఏ వంకీకో చొక్కా తగిలించి వుంటాడు. కొట్టేసి వుంటుంది" అని ఒకరు.

సావిత్రికి ఒక్క క్షణం కూతురు తీసిందేమోలనిపించింది.

ఇంతకీ అసలాయన మాత్రం లేదు అక్కడ. గబుక్కున స్ఫురించింది సావిత్రికి.

"అసలెవరు చెప్పారండీ!" ఏడిస్తే ఏమవుతుందో తెలుసు సావిత్రికి. ఏడుపు ఎంత లోకువ చేస్తుందో తెలుసు. దుఃఖాన్ని దిగమింగుకోవడం చిన్నప్పటి నుంచి అలవాటయింది.

తండ్రి జీతాలు అందగానే సారా కొట్టుకో, పేకాటకో తగలేస్తే తల్లి వంటలు చేసి తెచ్చిన దాంతో — మిగిలిన వంటకాలు తెచ్చి పిల్లలకి పెట్టి తను పొట్టలో కాళ్ళు పెట్టుకుని రోజుల తరబడి పస్తులున్నప్పుడు తల్లిని చూసి — పెళ్ళిళ్ళుకాని ఆడ పిల్లల్నీ — జేబుదొంగగా మారిన కొడుకునీ — అర్థంతరంగా ఒదిలేసి కాన్సర్‌తో చచ్చిపోతూ "మీరెలా బతుకుతారమ్మా" అని ఏడ్చిన తల్లిని చూసి—

సినిమా హాలు వెనక చుట్టు గుడిసెలో సత్తు పళ్ళెంలో తను ఎన్నడూ చూడని పదార్థాల్నిఆప్యాయంగా తింటూ అమ్మకంటే ఏ విధంగానూ బాగా వుండని మనిషితో సరసాలాడుతున్న తండ్రితో — "నాన్నా అమ్మ చచ్చిపోయింది" అని చెప్పినప్పుడు. "ఇప్పుడా" అన్న తండ్రి ప్రశ్నతో "నన్నింత ఇబ్బంది పెట్టిందే" అన్న భావం తోచి — ఏం చెప్పాలో తెలీక నిలబడిపోతే — "ఎల్లవయ్యా పెళ్ళాం సత్తే ఏడో ముండ కాళ్ళకాడ పడుంటాడంటారు. మల్లా నాకొచ్చుర్రి" అన్న ఆవిడ మాటలువిని — తింటున్న అన్నంలో వున్న ముక్కల్ని విలాసంగా కొరుతూ "అంతే నంటావా!" అంటూ సాంతం తిని మరీ చెయ్యి కడుక్కుని కారా కిళ్ళి వేసుకుని తాపీగా బయల్దేరిన నాన్నని చూసి— సావిత్రికి ఏడుపు గడ్డకట్టింది — ఆనాడే.

ఆ గుడిసెలో ఒక్క మంచం తప్ప ఏమీ లేదు. గుడిసె ముందు పొయ్యి వుంది.

ఆవిడ కూడా బాగా నలిగి ముడుచుకుపోయిన టెర్లిన్ చీరె కట్టుకుని వుంది. నాన్న అక్కడెందుకున్నాడో అర్థం కాలేదు సావిత్రికి అప్పుడు.

"ఏం చేశా! చెప్పు డబ్బు లెక్కడ పెట్టా! మిమ్మకిచ్చావా! చెప్పు" అడుగుతున్నాడు పోలీసు.

ఎప్పుడొచ్చాడో ఏమో ఇల్లు గల్లాయన కూడా పక్కనే నించుని వున్నాడు. ఇల్లు గల్లాయన వచ్చాక పోలీసు మాటల్లో గదమాయింపు పెరిగింది.

"ఏవిటండీ! మా అమ్మాయి డబ్బులు తియ్యడమేవిటి!" అడిగింది సావిత్రి. రామ్మూర్తిని చొక్కా పట్టుకుని ఒక్క ఊపున కిందపడేసి గుండెల మీద కూచుని ఆ పక్కా ఈ పక్కా ఫెడీ ఫెడీ వాయించాలని వుంది సావిత్రికి.


గుడ్లనీళ్ళు గుడ్ల కుక్కుకుని బితుకు బితుకుమంటూ కరెంటు స్తంభాన్నానుకుని నించున్న కొడుకు ఒక్కసారి ఆంజనేయ స్వామిలాగా ఆకాశమంత ఎత్తుకి ఎదిగి వీళ్ళందర్ని కాలితో చీమల్ని నలిపినట్టు నలిపేస్తే బావుండు అనుకుంది.

కూతుర్ని చూసింది. ఇంట్లోకెళ్ళి ఏ చీర ముక్కో తెచ్చిదాని ఛాతీ కప్పదామనిపించింది.

ఇన్ని అనిపించినా సావిత్రి "రామ్మూర్తిగారూ అసలు మీ డబ్బులు ఎప్పుడు పోయాయి? కనీసం మమ్మల్ని అడుగొచ్చుగా!" అని మాత్రమే అంది.

"నేను చెప్తతున్నాగా ఇయ్యాళ మజ్జానం పోయినయ్యి" అన్నాడు పోలీసు.

సినిమా పోలీసులా లేడు. వయసులోనే వున్నాడు.



సినిమా పోలీసులు అన్నీ తేలిపోయాక వస్తారు. ఇతను ముందే వచ్చాడు. అడపా దడపా లక్ష్మి వంక, అప్పంగా సావిత్రి వంకా చూస్తున్నాడు.

రామ్మూర్తి ఏం మాట్లాడ్డం లేదు.

పోలీసులో చలనం వచ్చింది. అకస్మాత్తుగా నాలుగ డుగులు దూరంలో వున్న లక్ష్మి దగ్గరికి ఒక్క అంగ వేశాడు. అసంకల్పితంగా తానూ ఒక్కగంలో కూతురి దగ్గరకొచ్చేసి అడ్డంగా నిలబడింది సావిత్రి.

జనంలో కలకలం, గుసగుసలు. మౌన భంగాలు, బోడి గుండు అన్నమాటలు వినిపిస్తున్నాయి.

"నేను అడుగుతాను" అంది సావిత్రి.

విలాసంగా ఓకాలు అక్కడ ఎత్తుగా వున్న రాయి మీద పెట్టి చుట్ట ఓ పీకు పీకి మళ్ళీ రిలాక్సయి పోయాడు పోలీసు.

జనం సైలెంటయిపోయారు.

"ఏవే! డబ్బులు తీశావా!" కూతుర్ని అడిగేటప్పుడు సావిత్రి గొంతు జీరబోయింది.

చారెడేసి కళ్ళతో రింగులు రింగులు జుట్టు మొహాన పడుతూ మిసమిస లాడుతున్న వయస్సులో ఇంకా పోషణ వుంటే — గొప్ప పుటక లక్ష్మిది.

తొలి చూలు కూతుర్ని చూసుకుని, 'అయ్యో ఆడ పిల్లా!" అని తనేడుస్తుంటే "లక్ష్మిదేవే!" అన్నాడు పెనిమిటి.

ఒక్క పెట్టున దుఃఖం వచ్చింది సావిత్రికి. పిల్లని జుట్టుపట్టి వంచి దబదబా నాలుగు బాదులు బాదింది. పుట్టి బుద్దెరిగాక అంతగా ఎప్పుడూ కొట్టలేదు.

లక్ష్మి కూలబడిపోయింది.

"నేనెరగనమ్మా! అసలు నాకు తెలీదు" అంటూ అమాయకంగా బావురుమంది లక్ష్మి.

"సావిత్రీ! పిల్లని కొట్టటమెందుకు నిదానంగా అడుగు" అంది ఇరుగమ్మ.

"కాడితే! చెప్తుందా తీసిన పిల్ల" అన్నాడు ఒకాయన.

"ఆ తల్లికి తెలీకుండా వుంటుందా?" అన్నాడు ఒకాయన.

అందరూ తెలిసిన వాళ్ళే. ఎవరు ఏమాటన్నారో గుర్తించే స్థితిలో లేదు సావిత్రి.

చిన్న పిల్లాడు వాసు, పెద్దోడు శీను వచ్చి అక్క పక్కనే నించున్నారు. ముగ్గురి కళ్ళల్లోనూ ఎర్ర జీర కనిపించింది సావిత్రికి.

చెమ్మగిల్లిన కళ్ళు మళ్ళీ ఎండిపోయాయి. చీకటి పడింది. జనం పల్చబడుతున్నారు.

"ఒకసారి ఇలా రండి" రామ్మూర్తి పోలీసుని పిల్చాడు.

చేతిలో చుట్ట గట్టిగా ఒక పీల్చు పీల్చి క్రింద పడేసి బూటు కాలితో తొక్కి పక్కకి అడుగువేశాడు పోలీసు.

నాలుగైదు నిమిషాలు గోడ వారకి వెళ్ళి మాట్లాడారు.

సావిత్రికి గుండెల్లో దడగా వుంది. చీకటి పడింది. కూతురు నిజానికి ఇంకా పెద్ద మనిషి కాలేదు. నెల నెలా తనే అన్నీ చెయ్యాలి. లంగాకి మరకలు చూసి తనే అన్నీ చేస్తుంది. నెల నెలా బడి మానేస్తానని పేచీ పెడితే తిట్టి తిమ్మి బడికి పంపిస్తుంది తను.

ఈ పిల్లని పోలీసు తీసికెళతాడా! తీసికెళ్ళి... ఆ తరువాత ఆలోచించలేకపోయింది.

ముగ్గురు పిల్లల్నీ రెండు చేతుల్తో చేరదీసుకుని కరెంటు స్తంభాన్నానుకుని నిల్చుండి పోయింది.

పోలీసు ముసి ముసిగా నవ్వుకుంటూ సావిత్రి దగ్గర కొచ్చి ఒక్క క్షణం నిలబడి ఒక గేలి చూపు చూసి కరెంటు స్తంభానికి అయిదారు గజాల దూరంలో ఆపుకున్న సైకిలు స్టాండు తీసి ఓ పది గజాలు నడిపించు కుంటూపోయి తరువాత సైకిలెక్కి రివ్వున వెళ్ళి పోయాడు.

సావిత్రి పోలీసు వంకా రామ్మూర్తి వంకా చూస్తుంది. ఏమీ అర్థం కావడంలేదు. పిల్లలు ముగ్గురూ పోలీసునే చూస్తూ పోలీసు సందు మలుపు తిరిగాక తల్లిని ఇంకా గట్టిగా వాటేసుకుని రామ్మూర్తి వంక చూడడం మొదలెట్టారు.

జనం బాగా పల్చబడ్డారు. సంపులోచ్చేశాయను కుంటూ ఆడవాళ్ళు వెళ్ళిపోతున్నారు.

నలుగురైదుగురు రామ్మూర్తి చుట్టూ చేరారు.

"ఎలా.పోయింది డబ్బు!"

"చూశారా? తియ్యడం?"

అయినా ఇలాంటివాళ్ళకు ఇల్లెట్టా ఇచ్చారు?"

"ఎందుకొచ్చిన గొడవ ఖాళీ చేయించండి."

"అక్కయ్యగారు తేరల్లే వుంది. జాగ్రత్తసామాన్లవీ"

ఎవ్వరూ రామ్మూర్తినించి సమాధానం ఆశించి నట్టుగా లేదు.

ఒక నవ్వు నవ్వి లోపలకెళ్ళి పోయాడు రామ్మూర్తి.

నాలుగొందల గజాల్లో కట్టిన ఇల్లు. ఒక గది ముందు వరండా వెనక వంటగది ముందు పక్క వరసగా నాలుగు రేకుటేన్లతో కట్టిన నాలుగు వాటాల ఇల్లు. ఇంటికి ఒక మూలగా వాస్తుశాస్త్రం ప్రకారం కట్టిన చుట్టింట్లో



వుంటుంది లక్ష్మి. అరవై రూపాయిలు అద్దె. ఇల్లు గలవాళ్ళ లెట్రిన్ వుపయోగించుకోమన్నారు. ఆ గదికి కరెంటు లేదు.

చీకటి పడిపోయింది. మునిసిపాలిటీ కరెంటు స్తంభానికి దీపం వెలిగింది. ఇంటి ఆవరణలోకి వెళ్ళ బుద్ధి కాలేదు. చుట్టిల్లు చీకటి గుయ్యారంలా వుంది. స్కూలు నుంచి వచ్చి వాకిలి ఊడ్చింది గాబోలు లక్ష్మి. వాకిలి శుభ్రంగానే వుంది. ముగ్గు చిప్ప, చీపురు నీళ్ళ బకెట్టు గడప ముందు పెట్టి వున్నాయి.

కూతుర్ని ఇంకా దగ్గరగా తీసుకుని తల నిమిరింది సావిత్రి. తలయెత్తి తల్లి మొహంలోకి చూసింది లక్ష్మి. చీకట్లో ఏమీ కనిపించలేదు తెల్లని కనుగుడ్లు తప్ప. ముగ్గురు పిల్లల్నీ తీసుకుని లోపలకి అడుగులేసింది. కట్ట కట్టుకున్నట్టున్నారు. చీకటిలో అందరూ ఒకేఆకారంగా కనిపిస్తున్నారు దూరంనించి.

లోపలికెళ్ళి కూలబడిపోయింది సావిత్రి. పిల్లలు ఏం తోచనట్టు నిలుచుండిపోయారు.

ఎక్కెక్కి ఏడుస్తోంది సావిత్రి. ఉప్పెనలా ఏడుస్తోంది.

"అమ్మా! అమ్మా!" ముగ్గురూ కలగాపులగంగా పిలుస్తున్నారు. ఎక్కిళ్ళు తప్ప పలకలేకపోతోంది.

ఏడ్చి ఏడ్చి ఒరిగిపోయింది. నిస్త్రాణంగా వుంది. లక్ష్మి తల్లి నానుకుని కూచుండిపోయింది. చిన్న పిల్లవాడు వాసు తల్లి పొట్టలో దూరిపోయాడు. పెద్దవాడు శీను బుడ్డి దీపం వెలిగించాడు.

లక్ష్మి తల్లి పక్కనే గోడవేపు తిరిగి పడుకుంది. శీను తలుపు గడిపెట్టి తల్లి తలయెత్తి గుడ్డ ముక్కల్తో కుట్టిన తలగడ తల్లి తల కింద పెట్టాడు.

పాముసిల్లినట్టున్న సావిత్రికి స్పృహ వచ్చినట్టయింది. అమ్మ గుర్తొచ్చింది.

ప్లీడరు గారింట్లో వంట చేసి వచ్చి తెచ్చిన వంటలన్నీ పిల్లలకు పెట్టిగాని ఏ పనీ చేయని అమ్మ ఒక్కోనాడు బాగా పొద్దుపోయాక వచ్చి తెచ్చినవన్నీ వంటింటిలో పడేసి దొడ్లోకి వెళ్ళి బుంగలు బుంగలు పిచ్చి పట్టినట్టు నీళ్ళు తోడుకుని జుట్టు ముడైనా విప్పకుండా తలారా పోసుకుని ఆ తడి గుడ్డల్తో దేవుడి పీట ముందు ఒళ్ళు తెలీకుండా కళ్ళు మూసుకుని కూచుని గణగణ మంటూ గట్టిగా గంట వాయిస్తూ వొణికే గొంతుతో అమ్మవారి స్తోత్రం చదువుతూ కూచునేది.

అవాళ అమ్మ దగ్గరికెళ్ళాలంటే అందరికీ భయంగానే వుండేది. ఆ అమ్మ గుర్తొంది సావిత్రికి.

వెంటనే, అయిదు రోజుల్నాడు పూల పొట్లం తెచ్చి లక్ష్మికి ఇచ్చి, "సావిత్రి మా ఆవిడ నెల దాకా రాదు.' పురిటికెళ్ళిందిగా. ఆ మాట కొస్తే అయిదారు నెలల్దాకా రాకపోవచ్చు. కాస్త వంటా అదీ చేసి పెట్టరాదూ'! అన్నప్పటి రామ్మూర్తి మొహం గుర్తొచ్చింది.

"!దేవుడి కెయ్యండి" అని తాను చెప్పడమూ గుర్తొచ్చింది.

మళ్ళీ దేవుడి పీట ముందు కూచున్న అమ్మ చెవుల్లో గణగణ గణ గంటల మోత.

ముడుచుకు పడుకున్న కొడుకుని జరిపి సరిగ్గా పడుకోబెట్టింది. వెల్లకిలా తిరిగి పడుకుంది.

సావిత్రి చూపు చుట్టింటి చూరుకు అతుక్కుపోయింది. *

**శిక్ష లేదు**

"నాన్నా! డాక్టరు కోర్సు చదివితే మంచి దేనా? ఏమైనా ప్రయోజనముంటుందా?" అనడిగాడు పుత్రరత్నం.

"మంచిది కాకపోవడమేమిట్రా! ఎంత మందిని చంపినా శిక్ష లేదు!" తిరిగ్గా చెప్పాడు తండ్రి.

—కె. వెంకటరావు అక్కయ్య